

**పురాణపండ రంగనాథ్**

**కా**శ్మీరం...

అలనాడు కశ్యప ప్రజాపతి నివశించిన కశ్యపదేశం.

పార్వతీ పరమేశ్వరుల విహార భూమి.

కిన్నర - కింపురుషాది దేవజాతుల స్త్రీ పురుషులు అలసట, విరామం ఎరుగక జీవనానందాన్ని అనుభవించిన ప్రేమదేశం.

కుంకుమ పూల అరుణ, పీత (పసుపు) వర్ణం, కన్నెల పాదాలకు పారాణి పెట్టే కామ దేశం.

ఎటు చూసినా నిశ్శబ్దాల చిగుళ్లలా కొండల మొదళ్లు

బేతవనాల సిసరు రామణీయకతలు

దేవదారు వృక్షాల మౌనజపాలు

మరి ఈనాడు...

టెర్రరిస్టుల శతఘ్ని గర్జనలతో ప్రతిధ్వనిస్తోంది.

మంచు శిఖరాలు నెత్తుటి పూలు రాలుస్తున్నాయి

ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎక్కడ ఏ ఉగ్రవాది ఏ పొదమాటు నుంచి ఎ.కె. 47 పేలుస్తాడో తెలీదు. అది ఏ అమాయక ప్రాణిని చంపి వేస్తుందో ఊహకే అందదు.

విచిత్రం...

భారతదేశ చరిత్రలో కాశ్మీర దేశం సుఖ శాంతులతో నిశ్చింతగా ఉన్న క్షణాలే కనిపించవు.

సౌందర్యం మార్మికమైనది. అది రక్తాన్ని ఉబికిస్తుంది. కోరికల్ని రెచ్చకొడుతుంది. రక్తాన్నే దాహంగా తీసుకొంటుంది. ఇందుకు సాక్ష్యం యిచ్చే గాథలు, వీరకథలు, విచిత్ర సంఘటనల గురించి సూరజ్ చదివాడు, విన్నాడు, చూస్తున్నాడు. కాశ్మీరులోని ప్రతి కొండ శిఖరం,

# కిన్నెర



ప్రతి వనం, ప్రతి సెలయేరు మౌనంగా ఈ ఉదంతాన్ని చెప్పక చెప్తుంటాయి.

సూరజ్ పత్రికా రచయిత. కాశ్మీరం పరిస్థితిని, పురాణ కథల స్మృతిని రంగరించి ధారావాహికంగా వ్యాసాలు, అనుభవాలు వ్రాయడానికి ధైర్యం చేసి ఆ ప్రాంతాన్ని పర్యటిస్తున్నాడు.

కిన్నెర ప్రాంతమంతా తిరిగాడు, శ్రీనగర్ వద్ద శంకరాచార్య శిఖరం ఎక్కాడు. టన్‌మార్గ్, గుల్‌మార్గ్ ప్రాంతాలు పర్యటించాడు. హజరత్ బాలల్ వంటి ఇస్లామిక్ పుణ్యక్షేత్రాలూ చూశాడు. ప్రస్తుతం శ్రీనగర్‌లో మకాం చేశాడు. అక్కడి హౌస్‌బోట్స్ సంస్కృతిని పరిశీలిస్తున్నాడు.

ఎక్కడ తిరిగినా, ఎవరిని కదిపినా విషాద గంభీరంగానే ఉంది. భద్రతా భావాన్ని కోల్పోయిన ప్రజల ముఖాలు నిర్లిప్తంగా ఉన్నాయి. కాశ్మీర్ సౌందర్యం అంతా భయంతో ఘనీభవించినట్లు ఉదాసీనంగా కనిపిస్తోంది.

జీలం నదిలో వయ్యారంగా కదులుతూ తిరుగాడే హౌస్‌బోట్లు అక్కడి దారిద్ర్యానికి సంకేతాలు. భారతదేశంలో ఇంత ఎత్తున ఉన్న ఈ దేవతల దేశంలో యింత దారిద్ర్యం ఉండడం ఎవరి తప్పు?

హౌస్‌బోట్లలో రాత్రిళ్లు కాశ్మీర్ కన్నెపిల్లలు చేసే శృంగార చేష్టలు విటులకు భలే పసందుగా ఉంటాయట. ప్రేమికులు, యువ దంపతులు, రసికులు అక్కడకు ప్రేమయాత్రలకై

వస్తారు. కాని అక్కడి యువతులకు అలాంటి జీవితమే లేదు. వాళ్లవి మాంసపు బొమ్మ జీవితాలు.

బేతవనచ్ఛాయల్లో వెన్నెల వెలుగు నీడలలో హౌస్‌బోట్లలోని దీపాలు జీలం నది లోతులలోకి కాంతి గునపాలు దింపే దృశ్యాలు అక్కడి రసిక సామ్రాజ్యపు మాదకతకు నిశ్శబ్ద సాక్ష్యాలు అనిపిస్తాయి. బేత వనాల నుంచి మంచుతో బరువెక్కిన విచిత్రపూల పరిమళం యువ హృదయాలలో కోరికల కెరటాల్ని సృష్టిస్తుంది.

ఆ సాయంత్రం అంత చలిగా లేదు. కానీ మంచు బిందువులు సన్నగా రాలుతున్నాయి. సూర్యుడు నునువెచ్చగా కిరణాల్ని ప్రసరిస్తున్నాడు. అలా ఎంతసేపుంటుందో తెలియదు. మరు క్షణంలో వర్షం జల్లులు పడవచ్చు. మంచులో తడిసిన సూర్యకిరణాలు మధ్యనుంచి తెల్లటి మేఘాలమీదుగా పడే వానజల్లు దృశ్యం బాగుంటుంది.

విచిత్ర వాతావరణం నుంచి కాపాడుకొందుకు సూరజ్ మంకీ క్యాప్, మఫ్లర్ కూడా దగ్గర ఉంచుకున్నాడు.

అతనిప్పుడు ఆ కొండవాలు వెంట బేతవనం అందాల్ని, దేవదారు వృక్షాల ఔన్నత్యాన్నీ చూస్తూ అడుగులు వేస్తున్నాడు. అతనికి అక్కడ స్పష్టమైన కార్యక్రమం, పనీ ఏమీ లేవు. కాళ్లు ఎటు దారితీస్తే, కళ్లు ఎటు ఆకర్షించబడితే, మనసు ఎటు ఎగిరిపోతే అటు వెళతాడు. అంతకుముందు తనకు అనుభూతిలో కాని, అనుభవంలో కాని లేని దృశ్యాల్ని, భావాన్ని పొదివి పట్టుకోవడం అతడి ఇప్పటి పని. స్థల కాలాల స్మృతి అంతా భావంలోనే ఇమిడి ఉంది అనుకొనే ప్రకృతి ఆరాధకుడతడు.

ఆ ప్రాంతంలోని నాగజాతి యువతులకు, భారతీయ జవానులకు ఉన్న లైంగిక సంబంధాల గురించి, అవి రగిల్చిన ప్రేమ తుఫానుల గురించీ అతను ఎన్నో విన్నాడు. అవన్నీ నిజమేనా? మగవాడు ఎంత కాముకుడు? స్త్రీ నిస్సహాయస్థితిని తన అవసరానికి వాడు కోవడమే పురుష జాతిలో పశుత్వమా?

పశువులు, పక్షులు కూడా మగవే ఆడజాతివి పెత్తనం చెలాయిస్తాయి. కామ తృప్తి క్కోసం అవి ఏమైనా చేస్తాయి. మనిషిలోనూ ఈ పశు ప్రవృత్తి కొనసాగి వస్తున్నదా?

కాశ్మీర్ సౌందర్యంలో ఈ కామ వాసన స్పష్టంగా అనుభూతికి వస్తుంది. అక్కడకు వచ్చిన స్త్రీ పురుషుల కామచేష్టలు దీనిని కళ్లకు కట్టిస్తాయి. ఇక్కడి ఆడపిల్లలు విటులకు చక్కగా శయనసుఖాన్ని పంచిపెడతారట.

స్త్రీ పురుష సెక్స్ సంబంధాలు చాలా సహజమైనవి, ఆనందప్రదమైనవి. మరి అద్దె సెక్స్ సంబంధం పశుత్వం కాదా? ఇంద్రియ సుఖంలో ఉల్లాసం ఉంది. సుగంధం ఉంది. సహజత్వాన్ని కోల్పోయిన ఇంద్రియ స్పర్శలో ఆ పరిమళం లేదు. అది కేవలం పశువాంఛ... అంతే.

ఆలోచిస్తూ నడుస్తున్న సూరజ్‌కి ఒక కేక వినిపించింది. దేశం కాని దేశంలో, మనుషులు కాని మనుషుల మధ్య అచ్చ తెలుగులో ఆ పిలుపు అతనికి ఆశ్చర్యం కలిగించింది. క్షణకాలం నివ్వెరపోయి ఆ కేక వినవచ్చినవైపు చూశాడు.

అక్కడ ఒక యువతి ఉంది. కాశ్మీర్ దుస్తుల్లో నిలబడి, చేయెత్తి తనని పిలుస్తున్నది. అతనూ మర్యాదకోసం చేయి ఊపి వేగంగా అడుగులు వేసి ఆమె దగ్గరకు వెళ్లాడు.

అల్చిప్పల్లాంటి కళ్లు మెరుస్తున్నాయి. పెదాలకు లిప్‌స్టిక్ రంగు నిగారిస్తోంది. జుట్టు విరబోసుకుని ఉంది. ఆమెను చూడగానే సూరజ్‌కి సుబ్రహ్మణ్య భారతి అలనాడు వ్రాసిన ఒక గీతం తాలూకు భావం దృశ్యమై కనిపించింది.

"ఓ సుందర తెలుగు భామ కాశ్మీరీ తిలకం దిద్దుకుని మానస సరోవర జలకాలాడినట్లు"

అతను ఆ అమ్మాయిని కనురెప్పపాటు మరిచిపోయి అలాగే చూస్తున్నాడు. అతనికి తాను గుర్తుకు రాలేదని ఆమె గ్రహించింది.

"ఏయ్, సూరజ్ నేను కిన్నెరని" - ఆమె సుతారంగా నవ్వినపుడు బుగ్గమీద పడిన చిన్న సొట్ట ఆమెను అతనికి పట్టి యిచ్చింది.

"మరచిపోయినట్లున్నావ్. ఔన్లే... మగాళ్లు పెద్దగా మారరు. ఆడవాళ్లం కదా మార్పు బాగా వచ్చేస్తుంది."

అతను పూర్తిగా ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు. ఆమె కిన్నెర. కాలేజీలో తన క్లాస్‌మేట్. కాలేజి వదిలి నాలుగైదేళ్లయింది. తను పత్రికా రచనని వృత్తిగా తీసుకున్నాడు.

కిన్నెర అందమైనది. నాజూకైనది. హుషారైనది. కలుపుగోలుతనం ఎక్కువ. ఆమె ఈ విలక్షణ వ్యక్తిత్వాన్ని తప్పుగా అర్థం చేసుకొని, చనువు తీసుకున్న ఇద్దరు ముగ్గురు కాలేజి కుర్రాళ్లు ఆమె ఒంటిమీద చేయివేయకుండానే చెంప దెబ్బ తిన్నారు. కిన్నెర అన్ని యాక్టివిటీస్‌లోనూ పాల్గొనేది.

"ఆమెతో స్నేహం ఎండమావిలో నీటి కోసం ఆరాటం. నీళ్లులేని ఒయాసిస్సు వెంట పరుగు" అని తానే ఒకసారి వ్యాఖ్యానించాడు కూడాను.

కాలేజి వదిలాక ఆమె ఏమయిందో తనకు తెలియదు. తెలుసుకోవలసినంత అవసరం ఏమీ లేదు. తను మాత్రం రచయితగా, కథా రచయితగా ఈ నాలుగైదేళ్లలో బాగా పాపులర్ అయ్యాడు.

"రా మాబోట్‌కి వెళ్దాం. అదిగో అదే కిన్నెర అతని సమాధానానికి ఎదురుచూడకుండా ఒక అడుగు ముందుకు వేసింది.

"నువ్విక్కడ?" సూరజ్ ఆమె వెనుక అడుగు వేస్తూ అడిగాడు.

"ఆ ప్రశ్న నిన్ను నే వేస్తున్నాను" - అందామె ముందుకు నడుస్తూ.

"ఏం ఉంది? కథలూ, పత్రికా రచనలూ చేస్తున్నాను"

"చదువుతూనే ఉన్నాను"

ఈసారి కాశ్మీరీ నేపథ్యంలో వార్తా కథనం, కథా కథనం చేయాలని వచ్చాను. తిరుగుతున్నాను.

"నువ్వేం మారలేదు అలాగే ఉన్నావ్. అందుకే గుర్తు పట్టగలిగాను. కిన్నెర వెనక్కు తిరగలేదు. ముందుకు తన హౌస్‌బోట్ వైపు నడుస్తూనే ఉంది. మాట్లాడుతూనే ఉంది.

కాలేజి రోజుల్లో పొందికగా ఉండిన ఆమె ఒళ్లు ఇప్పుడు కొంచెం పెరిగింది. నడకలో ఆమె కదలికలు కండరాల సడలింపుని సూచిస్తున్నాయి.

"పెయింటింగ్స్ వేస్తున్నావా, మానేశావా?" సూరజ్ ప్రశ్నించాడు.

"వేస్తున్నా అందుకే ఇక్కడకు వచ్చాను. ఈ శరత్కాలంలో కాశ్మీరీ సౌందర్యం భలే గమ్మత్తుగా ఉంటుంది. పురి విప్పిన అందాల వన కిన్నెర వలె ఉంటుంది కాశ్మీరం. కిన్నెర మాటలు చురుగ్గా ఉన్నాయి.

"ఔను, అది సరే... కూడా ఎవ్వరూ రాలేదా?" సూరజ్ ప్రశ్నించాడు.

"మా వారితో వచ్చాను"

"మీ వారా?"

"ఆ చెప్పలేదు కదూ. నాకు రెండేళ్ల క్రితం పెళ్లి అయింది. ఆయన మిలటరీ ఆఫీసర్. అంబాలా కంటోన్మెంట్‌లో. సెలవు పెట్టివచ్చాం. వచ్చిన రెండు రోజులకే కబురు వచ్చిం

ది వెళ్లారు. వస్తారు" - కిన్నెర కలుపు గోలు తనంతో ఏ మార్పూ లేదు. ఇంకా కాలేజి పిల్ల లానే అనుకొంటున్నట్లుంది.

"ఐ.సీ. సూరజ్ ముక్తసరిగా అన్నాడు."

"ఎలా ఉందిక్కడ?" కిన్నెర అడిగింది.

"ఇంత అందమైన ప్రదేశంలో యిలాంటి పేదరికం?" అని మరి ఆగిపోయాడు సూరజ్. అతని మాటల్లో కాశ్మీరీ కన్యల దీన స్థితిపై దిగులు వ్యక్తం అయింది.

"నీకింకా భావుకత్వం పోలేదన్నమాట? నువ్వింకా వాస్తవ జగత్తులోకి రాలేదన్నమాట?" కిన్నెర తేలికగా అంది.

"ఆర్ద్రతని, భావుకత్వాన్నీ కోల్పోతే మనిషికి, పశువుకీ తేడా ఏం ఉంది?" సూరజ్ తటాలున అనేశాడు.

అతని మాటలకి కిన్నెర తటాలున ఆగి, వెనక్కి మార్మికంగా చూసింది. ఏమీ మాట్లాడక నడక సాగించింది.

ఆమె వెనక్కి చూడడం వింత అనిపించలేదు కానీ ఆమె ముఖంపై ఘనీభవించిన మహా మౌనం అతనికి ప్రశ్న అయింది. కొద్ది అడుగులు వేసే సరికే హౌస్‌బోట్ వచ్చేసింది.

హౌస్‌బోట్‌లో అంతా చక్కగా ఉంది. అలంకరణలో ఆడంబరం లేదు కానీ ఆకర్షణ ఉంది. సౌందర్యం, ఆధునికతల మిశ్రమంగా ఆ దృశ్యాలున్నాయి. ఆ పెయింటింగ్‌లలో చాలా భాగం కిన్నెర వేసినవే.

కాలేజిలో కిన్నెర సామాజిక సమస్యలు, వరకట్నం చావులు, ధనిక పేద భేదాలు గురించి ఆవేశంగా మాట్లాడేది. భావ విప్లవం రావాలని, సామాజిక సంస్కరణలు జరగాలనీ వాదించేది. ఇప్పుడామె వ్యవహారణ అలా లేదు. జీవితంలోని సుఖాల్ని కౌగలించుకోవాలనే తపన కనిపిస్తోంది. బ్రతుకును అర్థవంతం చేసుకోవాలనే కాంక్ష ద్యోతకం అవుతోంది.

హౌస్‌బోట్‌లోని డ్రాయింగ్‌రూమ్ మాత్రం చాలా ఆడంబరంగా ఉంది. ఈ నాటి యువతులు కోరుకునే జీవితం అక్కడ సాక్షాత్కరిస్తోంది. అక్కడి అలంకరణ వస్తువులుగా ఉన్న చిన్ని చిన్ని సంగీత పరికరాల్ని, పుస్తకాల్ని చూసి కిన్నెర చెప్తున్న మాటలు పెద్ద హిపోక్రసీగా అనిపిస్తున్నాయి తప్ప వాటికి మనిషి జీవితంలో ఒక ఉనికి, సార్థకత ఉన్నాయనే నమ్మకం ఆమెకు ఉన్నట్లు అనిపించడం లేదు. ఆనాటి కిన్నెరకు, నేటి కిన్నెరకూ ఎంత తేడా? ఆమె గురించిన సూరజ్ భావాలు జీలం నదిలో కెరటాల వలె చెదిరి కరిగిపోతున్నాయి.

ఎలాంటి సంకోచం లేకుండా కిన్నెర తమ బెడ్‌రూమ్‌ని అతనికి చూపింది. ఆ పరిసరాల్ని అలవాటు చేసుకొనేలోగానే ఆమె వేసిన ప్రశ్న అతనికి 'చళుక్' అని తగిలింది.

"ఇంతకీ పెళ్లి చేసుకున్నావా లేదా?" ఆ బెడ్‌రూమ్ తలుపు అవతలకు వెళుతూ కిన్నెర ఈ మాట అంది.

"చేసుకున్నా, అదొక రెక్. మా ఇద్దరికీ సరిపడలేదు దట్సాల్" సూరజ్ నిరాసక్తంగా అనేసి ఆ గదిని పరీక్షించసాగాడు. కిన్నెర అక్కడ నుంచి వెళ్లిపోయింది.

ఆ గది, గదిలో బెడ్... ఇద్దరు మనుషులకు హాయిగా, ఏకాంతంగా ఉండటానికి పరిమితమైన కొలతలతో ఉంది. ఆ గది కర్రగోడలకు శృంగార భంగిమల చిత్రాలు అలంకరించి ఉన్నాయి. నిజానికి ఏ స్త్రీకాని, ఏ పురుషుడు కాని తమ పడక గదిని అంత ఓపెన్‌గా బయటివారికి చూపిస్తారా. ఏమో, తనకు అలాంటి సందర్భం తటస్థపడలేదు. ఆ అవకాశం, అవసరం రాలేదు. మరి కిన్నెర ఎందుకు చూపిస్తోంది.

ఆమె అంతర్యం ఏమిటి?

ఆధునిక భావాలు మనిషిని శాపగ్రస్తుడిని చేశాయా? ప్రతి క్షణాన్నీ తన ప్రైవేటు ఆస్తిగా మార్చుకోవాలనుకునే స్వార్థచింతనలోకి మనిషిని నెట్టివేసిందా యీ యాంత్రిక నాగరికత? వృత్తికి, ప్రవృత్తికీ బానిస అయిన ఆధునిక మానవుడు సహజత్వాన్ని మరిచిపోయి, దొంగ వలె ప్రవర్తిస్తున్నాడు. గుట్టుగా ఉండాలనుకొంటున్నాడు. తన వైయక్తిక జీవితం ఎవరికీ తెలియకూడదనుకొంటున్నాడు. కిన్నెర అలా కాక తన ప్రైవేట్ లైఫ్ గురించి పరోక్షంగా పరిచయం చేస్తూ చాలా సహజంగా ప్రవర్తి స్తోంది. క్షణకాలమే 'నిజం' అదే తన నిజమైన ఉనికి అని ఆమె భావిస్తున్నట్లుంది.

"నిన్న లేదు
రేపు తెలీదు
నేడు నిజమైనది"

- అన్న ఉమర్ ఖయ్యామ్ జీవన తత్వాన్ని కిన్నెర వంటబట్టించుకున్నట్లుంది. అతని ఆలోచనలతో నిమిత్తం లేకుండా ఆమె టీ తయారుచేస్తోంది. సూరజ్ ఆ గదిలోంచి డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చాడు. అక్కడి టీపాయ్‌పై కొన్ని పాత పత్రికలున్నాయి. చిన్న స్టాండ్‌కి అగరువత్తులు వెలిగించి పెట్టినట్లుంది. అవి కాశ్మీరాగరు వాసనని, కుంకుమపూల పరిమళాన్నీ కలుపుకొన్న మాదకతలో - ముందుగా పొగని ప్రసరిస్తున్నాయి.

ప్రక్కగా చిన్న స్టూల్‌పై ఫ్లవర్‌వాజ్ ఉంది. వాటిలో తాజా పూలున్నాయి. కాని వాటిపై ఎవరికీ ప్రేమ ఉన్నట్టు లేదు. కాళ్లు విరిచి ఫ్లవర్‌వాజ్‌లో వాటిని బంధించినట్లు దీనంగా ఉన్నాయి.

కిన్నెర టీ తెచ్చి ఇచ్చింది. ఈసారి ఆమెలో, ఆమె చూపులలో ఇదివరకటి నైర్మల్యం లేదు. ఆమె ఏదో భావావేశానికి గురి అయినట్లు కనిపిస్తోంది.

"మరి నీకో, సూరజ్ టీ త్రాగబోతూ ఆగి అడిగాడు

"తర్వాత తాగుతాను. నువ్వు త్రాగుతుండు ఇప్పుడే వస్తా" అని కిన్నెర రివ్వున వెనుదిరిగి డెక్‌మీదకు వెళ్లే మెట్లు ఎక్కసాగింది. సూరజ్ అక్కడి కిటికీలోంచి బయటకు చూశాడు. మేఘాలు ఆవరిస్తున్నాయి. ఇంతసేపు ఆ బోట్ హౌస్‌ని చూసే ధ్యాసలో పరిసరాల్ని గమనించనే లేదు. కిన్నెర ఎందుకు తన నుంచి ఆ సమయంలో తప్పించుకుని వెళ్లిందో అతనికి అర్థం కాలేదు. తానూ డెక్‌పైకి వెళ్తే...? టీ త్రాగమని ఇచ్చి ఆమె వెళ్లిందీ అంటే తనతో రావడం ఆమెకు ఇష్టం లేదనేగా? సూరజ్ గబగబా టీ సిప్ చేశాడు. ఆమె వచ్చేవరకూ కాలక్షేపం కోసం అక్కడి అలమారాను తదేకంగా ఈసారి పరిశీలించాడు. దానిలో ఏదో ఒక ఇంగ్లీషు పత్రిక కనిపిస్తోంది. సూరజ్ ఆసక్తిగా ఆ పత్రికని బయటకు లాగాడు. అది ఇంగ్లీష్ సెక్స్ పత్రిక. స్త్రీ పురుషులు ఏకాంతంలో చూసుకొనే బొమ్మలు దానిలో చాలా ఉన్నాయి. పురుషుల నగ్న చిత్రాలకన్నా స్త్రీల నగ్నచిత్రాలు ఎక్కువగా ఉన్నాయి.

ఒక స్త్రీ వ్యక్తిగత జీవితంలోకి ఇలా రహస్యంగా ప్రవేశించడం ఒక తప్పు. అయితే అలాంటి పుస్తకాన్ని తెరవడం మరీ పెద్ద తప్పు అనుకున్నాడు సూరజ్.

ఆ బొమ్మలన్నీ యవ్వనం నిగారింపుతో, కామ భంగిమలతో మత్తిల్లిన స్త్రీల దిగంబర చిత్రాలే. అందం, ఆరోగ్యం, స్తనద్వయం, ధృఢ కటివలయసీమలతో నిగారిస్తున్నవే. స్త్రీని నగ్నంగా చూస్తుండాలన్న పురుషుడి బలహీనత సూరజ్‌కీ ఉంది. అలాంటి బలహీనుల కోసమే ఆ పుస్తకం. కిన్నెర, ఆమె భర్త ఈ పుస్తకాన్ని...?

సూరజ్ దొంగచూపులతో దానిలోని స్త్రీల నిలువెత్తు సౌందర్య భాగాల్ని తనివితీరా చూశాడు. వెంటనే ఆ పుస్తకాన్ని తీసినచోటనే ఉంచేసి ఏమీ తెలీనట్లు అక్కడ కుర్చీలో కూర్చున్నాడు. ఇంతలో టప టప మని వాన ప్రారంభమై నిమిషం తిరక్కుండానే పెద్ద జల్లు పడసాగింది. కాశ్మీరం ప్రకృతి వింతే అంత.

కిన్నెర డెక్ మీద నుంచి వచ్చేయాలే? వాన తగ్గితే కాని తాను తన హౌస్‌బోట్‌కి వెళ్లలేడు. చీకటి పడిపోతే అక్కడకు వెళ్లడం మరీ కష్టం.

కిన్నెర రానే వచ్చింది. ఆమె పొడవాటి జుట్టుకొసల నుంచి వాన చినుకులు ముత్యాల్లా రాలి పడుతున్నాయి. అంతగా ఆమె తడిసిందన్నమాట. చలికి ఆమె కొంచెం వణుకుతోంది. ఒంటికి అతుక్కుపోయిన బట్టలలోంచి ఆమె కందరాలు తమాషాగా కనిపిస్తున్నాయి. పెదాల మీద లిప్‌స్టిక్ కరిగిపోయింది. సూరజ్ ఆమెని ప్రశ్నార్థకంగా చూస్తూ ఉన్నాడు.

"పైన బట్టలు ఆరేశాను. తీద్దామని వెళ్లాను... ఇంతలోనే జల్లు... బాగా తడిశాను" ఆమె చాలా సాదాగా అంది.

ఆమె అబద్ధం చెబుతోందని అర్థం అవుతోంది. ఎందుకంటే ఆమె చేతుల్లో బట్టలేం లేవు. పై నుంచి ఆమె ఏం తేలేదు.

కిన్నెర బెడ్‌రూమ్ వైపు వెళ్లిపోయింది. ఒక పురుషుడితోటి ఒంటరితనం ఆమెలో అక్కర లేని భయాన్ని కలిగించింది. అందుకే ఆమె పైకి వెళ్లిపోయింది. అంటే తన సాన్నిధ్యంలో ఆమె నిగ్రహాన్ని కోల్పోతోందా? అందుకే తప్పించుకుని పైకి వెళ్లి, క్రిందకు వచ్చి అబద్ధం చెప్పాన్న భావం కలగడంతో కొంచెం సిగ్గు పడింది. ఈ భావాలేం తెలియకుండా లోపలకు వెళ్లిపోయింది. ఇదంతా కృత్రిమత్వం కాదా? సమాజం విధించిన స్త్రీ పురుష సంబంధాల పంజరంలో ఇలాంటి విషమ ఘడియ వచ్చినప్పుడు కృత్రిమత్వం పొరలు ఛేదించబడ తాయి. సహజత్వం వేయి రెక్కలు విప్పుతుంది.

సూరజ్ ఆలోచనలు పూర్తి కానేలేదు. కిన్నెర దుస్తులు మార్చుకు వచ్చింది. మొగలి రేకు రంగుచీర అదే రంగు అంచు జాకెట్‌లో ఆమె మొగల కన్యలాగానే ఉంది. స్త్రీ సౌందర్యం మొగలి పూవు వంటిదైతే సమాజ నియమాలు దానిచుట్టూ ఉన్న ముళ్ల వంటివి. ఇప్పుడు కిన్నెర స్థితి అదే అయితే ఆమెలో కృత్రిమత్వం లేదు. కలుషిత భావాల రంగులూ లేవు. వాన కడిగిన నంది వర్ధనంలా ఉందామె ముఖం. ఈసారి సూరజ్‌ని మాట్లాడనివ్వలేదామె... తానే మాట్లాడింది.

"సూరజ్... చెప్పడానికి ఎంతైనా ఉంది. కానీ నేను ఒక లతవలె చెట్టుకు అల్లుకుపోయిన దానిని. ఇప్పుడు నాలో ఆనాటి కలలు లేవు, భావనలు లేవు, కల్పనలు లేవు. ఇప్పుడు నా రూపం ఒక భార్య. నా కలలు ఒక గృహిణి అంతే. కాని నేను ఒక స్త్రీని అని ఆలోచించే అవకాశమే లేదు.

"భార్యాభర్తలు రోజులో కొన్ని గంటలు అయినా తమ దాంపత్య జీవితపు భావాల పంజరంలోంచి బయటకు వచ్చి స్త్రీ పురుషులం అని జీవించగలిగితే తమవైన కల్పనలతో జీవించగలిగితే ఆ బ్రతుకు ఎంత మధురంగా ఉంటుందో, ఇద్దరి కోరికలు చాలావరకూ తీరుతాయి. ఆత్మ వంచన నుంచి, సందిగ్ధ సంకుచితత్వం నుంచి మనం విముక్తులం అయితే ఎంత బాగుంటుందో"

తళుకు కళ్ల చురుకుతో సూరజ్‌ని, అతని మనసునీ గాయపరచి కిన్నెర మరలా ఇలా అంది.

"పురుషుడి కోర్కెల సర్పబంధం నుంచి స్త్రీ

విముక్తం అయిందనే భావన ఎంత పూరట కలిగిస్తుందో, అలాగే స్త్రీని చర్మం స్పర్శల మాంసం ముద్దగా, బొమ్మగా, కన్నీటి కదలిగా కాక ఒక ఆత్మచైతన్య వ్యక్తిగా పురుషుడు ఆరాధించగలిగితే ఆ జన్మకి ఎంత సార్ధకత? ఆ దశలో స్త్రీ పురుషులు ఏ స్వచ్ఛ గంధర్వ లోకాలలోకో ఎగిరిపోతారు. స్వర్గద్వారాలను తెరిచిన వారవుతారు. అప్పుడు జీవితం ఎంత రుచివంతం, ఎంత సౌందర్యవంతం అవుతుందో ఆలోచించు. సూరజ్... నేను అబద్ధం చెప్తున్నానా? చెప్పు... నేను అబద్ధం చెప్తున్నానా?"

కొన్నెర భావావేశంతో కదిలిపోయింది. సూరజ్ రెండు భుజాలూ పట్టుకొని కుదిపేసింది. చివరి మాటనే పదేపదే అంది. ఆమె కళ్ళు ఇప్పుడు నక్షత్ర కాంతుల్ని వెదజల్లుతున్నాయి.

బలహీనతల నుంచి బయటపడి సత్యాన్ని అంగీకరించడానికి ఎంత సంస్కారం, ఎంతటి సాహసం కావాలి? అవి కిన్నెరకు ఉన్నాయి. కిన్నెరలో ఉన్నాయి. వజ్రంతునకల వంటి ఆమె మాటల జడిలో తడిసిన సూరజ్ ఆరాధనగా, గౌరవంగా కిన్నెర ముఖాన గట్టిగా ముద్దు పెట్టాడు అంతే... వాన వెలిసింది... ఆమె శాంతించింది. సూరజ్ కెమెరా, మంకీకాప్, మఫ్లర్ తీసుకుని మసక వెన్నెల వ్యాపిస్తున్న దారుల వెంట నడుస్తున్నాడు.

ఆ వెన్నెల ఎంతోసేపు లేదు. బేతవనం అంతా చీకటి అలుముకుంది.

ఆరిపోయిన రాక్షసి బొగ్గుపొడి పామినట్లు కారుచీకటి వ్యాపించింది. ఆకాశంలో మేఘాలు బరువుతీరిన తేలికతనంతో పరుగుపెడుతున్నాయి.

చలి పెరుగుతోంది. పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ సూరజ్ తన హౌస్‌బోట్‌ని సమీపిస్తున్నాడు.

ప్రవహిస్తున్న జీలం నది ఒడ్డున మౌనంగా నిలిచిన కొండ శిఖరాలు బేతవనం, దేవదారు వృక్షాలు, విశ్రమించిన జల పక్షులవలె హౌస్ బోట్లు. వాటిలో ఎందరో కన్నెల జీవితాలు రక్త స్థాపితాలు అవుతాయి. వారి కళ్లల్లో పవిత్రత ఒక భ్రమ వలె కన్నీటి పొరగా తారట్లాడుతోంది. ఇప్పుడు హౌస్‌బోటుల్లో కన్నెలు ఏ అజ్ఞాత కామాంధుల కౌగిలిలోనో నలిగి పోతూంటారు. అది వారికి ఇష్టంలేని తప్పుని సరి మదనక్రీడ.

కిన్నెర... కోరే స్వేచ్ఛలోని అంతరార్థం ఏమిటి?

హౌస్‌బోట్ పైకి ఎక్కి సూరజ్ ఆలోచిస్తూ కలియజూశాడు. జీలం నది చీకటి మడుగుని చూశాడు.

నిద్రిస్తున్న బస్తీ...

దీపాల బంగారు కాంతిలో జీలం నది నిశ్శబ్ధం.

నదీ తరంగాలపై జీవితాల నీడలు...

నిద్రిస్తున్న మనిషి ముఖం మీది నైర్మల్యం వలె జీలం నదిని శాంతి, అమాయకత్వం ఆవరించాయి. ఇప్పుడు అక్కడ ఆ నిశీధిలో కృతకాలైన మానవ విలువలు లేవు. అంతా సహజత్వం. అంతా నిశ్శబ్ధం. ●

## గుర్తించలేమా?

కొత్తగా పెళ్ళైన వసుంధర తన భర్తతో బజారు నుంచి తిరిగివస్తూండగా దారిలో చిన్ననాటి మిత్రురాలు లక్ష్మి కనిపిస్తే పలకరించింది.

బిక్కమొఖంతో దిక్కులు చూస్తున్న తన భర్తని పరిచయం చేస్తూ 'వీరే మావారు' అంది.

దానికా మిత్రురాలు 'పోదూ బడాయి! ఆ మాత్రం కనుక్కోలేనా ఏంటి?' అన్నది సమాధానంగా.